30704870l

# ప్రబోధ 13

చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమైనుపెం
పెక్కినతేనెకన్న అతిరుచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే అనిపించుకొన నిత్యమున్
చక్కగదాని మీరు మనసాస్మరియింపుడు రామనామమున్.

ప్రేమస్వరూపులారా!

రామాయణమనగా కేవలము రాముల యొక్క చరిత్రమాత్రమే కాదు. ఇది ముచ్చటగా మూడు పట్టణముల గురించి ప్రబోధించిన చరిత్రనే. మొదటిది మిథిలాపురము. రెండవది అయోధ్య. మూడవది లంక. మూడు నగరముల విశిష్టతను వాని అయనములను ప్రబోధించి నిరూపించినటువంటి స్వరూపము రామ తత్త్వము. రాముడు ధర్మస్వరూపము. లక్ష్మణుడు శ్రద్ధాస్వరూపము. భరతుడు భక్తిస్వరూపుడు. శత్రుఘ్నుడు శక్తిస్వరూపుడు. ధర్మమునకు అండ శ్రద్ధ. భక్తికి కవచము శక్తి. కనుకనే రామలక్ష్మణులు ఒకవైపున, భరతశత్రుఘ్నులు మరొకవైపున యానమును ప్రారంభించి దేవ్యాప్తి గావిస్తూవచ్చారు. రామునికి పదహారు సంవత్సరములు అయినదో లేదో అదే సమయమునకు విశ్వామిత్రుని ఆగమనము ప్రారంభమైంది. విశ్వామిత్రుని ఆగమనముతో రాముని అయనము ప్రారంభమైంది. విశ్వామిత్రుని యజ్ఞశాల సంరక్షణార్థమై రాక్షస సంహారముతో ప్రారంభమై, తిరిగి మిథిలాపురప్రయాణములో అహల్యాశాపవిమోచనము చేసి, శివధనుస్సు విరచి, మహామాయ శక్తి అయినటువంటి సీతను చేపట్టి, పరశురామునితో పోరాడి, అయోధ్యప్రవేశించి, తదుపరి అరణ్యములో ప్రవేశించి, సీతాన్వేషణ సల్పి, లంకాయాత్ర చేసి, రావణ సంహారము జరిపి, తిరిగి అయోధ్య చేరుకొనుంవరకు హాయి స్థాయి లేకుండా శ్రీరాముని అయనము సాగినది.

అయనమనగా యేమిటి అనే విషయాన్ని యీనాడు గుర్తించాలి. రమ్ అనే ధాతువునుండి పుట్టినది రామశబ్దము. యి అనే ధాతువునుండి పుట్టినది అయన శబ్దము. రామ అనగా రమించటం, ఆనందించటం, ఆనందింపచేయటం, ఆహ్లాదం కలుగచేయటం. చలనం, గమనం స్పందనం యీ మూడింటి తత్త్వమే అయనం. ర అనగా ఆత్మ. మ అనగా మనసు. మనసును ఆత్మతో చేర్చటమే రామ తత్త్వము. అనగా ఆనందమనే తత్త్వమును ప్రపంచవ్యాప్తి గావించటమే రామ అయనం. ఆనందమునను భవించి, ఆనందమును పెంచి, ఆనందమును పంచటమే రామ తత్త్వము. సర్వవ్యాపకము గావించునది అయనము. ఆహ్లాదమును సర్వవ్యాప్తి గావించటమే రామ తత్త్వము.

కేవలము రాముడు మాత్రమే కాదు యీ వ్యాప్తి గావించటము సీత అయనం కూడ

307048702

వుంటున్నది. రామ అయనమే రామాయణం. సీతకు కూడా రామ అనిపేరు. కనుకనే రామా మణి అని కూడను సీతను సంబోధిస్తూవుంటారు. అనగా రామ-సీత. రామ-రాముడు. లోకములో దాంపత్యమనేది భార్యాభర్తలిరువురూ ఒకేరూపమును ధరించివుండరు. రూపమునందుకాని, గుణములందుకాని, భావములందుకాని, నడతలయందుకాని భిన్న భేధములు కన్పిస్తుంటాయి. కాని సీతారాముల విషయంలో రూపనామములయందుకాని, ప్రవర్తనలయందుకాని, గుణగణములందుకాని, భావసంకల్పములందుకాని యెట్టి భేదములు కూడా వుండేటువంటివి కావు. దీనికొక చిన్న ఉదాహరణము. ఇదిస్వానుభవము. హనుమంతుడు రాముడులేని సమయములో ఒకపరి సీతను దర్శించాడు. హనుమంతునికి సందేహం కల్గింది. శ్రీరామచంద్రుడే స్త్రీ రూపం ధరించివున్నాడా అని. ఈమె శ్రీరాముడే కదా అని ఆరూపాన్ని చూచి శ్రీరామునిగా భావిస్తూవచ్చాడు. కన్నులందుకాని, ముక్కునందుకాని, పెదవులందుకాని, పండ్లయందుకాని, చెవులందుకాని రామునికి సీతకు యెట్టి భేదము కన్పించలేదు. కనుక రామారామా స్వరూపమైనటువంటిది సీతారాముల స్వరూపాలు. ఇరువురు ఏకస్వరూపులేకాని భిన్నస్వరూపులు కాదు.

ఇక్కడ మూడు పట్టణముల గురించి మనం చక్కగా విచారించినప్పుడు వీరి స్వరూపస్వభావాలు మనకు చక్కగా అర్థం అవుతాయి. మొదటి పట్టణము మిథిలాపురము. దీనికి రాజు జనక మహారాజు. ఇతను మహాత్యాగి, బ్రహ్మజ్ఞాని. తామరాకుపై నీటి బిందువువలె జగత్సంబంధమైన భావములు యితనియందు కానరావు. కన్న బిడ్డలు లేరు. దొరికిన బిడ్డనే ప్రీతిగా సాకుతూ వచ్చాడు. అతని రాజ్యములో వుండిన మహాశక్తివంతమైన వస్తువులు రెండే. సీత, శివధనుస్సు రెండే. ఒకానొక సమయమున సీత శివధనుస్సును అవలీలగా యెత్తి అవలపెట్టింది. ఈ దృశ్యాన్ని చూచాడు జనక మహారాజు. శివధనుస్సును యెత్తినటువంటివానికే సీతను యివ్వాలని ఒకవిధమైన దృఢసంకల్పము చేసుకున్నాడు. శివధనుస్సు యెత్తినటువంటివాడే సీతకు సరియైనటువంటివాడు. ఈ సంకల్పమును మనసునందు దృఢం చేసుకొని స్వయంవరమునకు రాజులను ఆహ్వానించాడు. రాముడు ప్రవేశించి యేవిధముగా సీత అవలీలగా ఆ శివధనుస్సునెత్తి అవలపెట్టెనో అదేవిధముగనే రాముడు అవలీలగా యెత్తాడు ఆ శివధనుస్సును. సీతారాముల స్వరూపమే కాక, గుణములేకాక శక్తిసామర్థ్యములు కూడా సమానమైనవేనని గుర్తించాడు యీ జనకుడు.

సీత సామాన్యమైనది కాదు. మహామాయాస్వరూపిణి. మహామాయాతత్వాన్ని స్వాధీన పరుచుకున్నాడు రాముడు. మహాశక్తి స్వరూపమైన దివ్యత్వమైన ఆత్మతత్వాన్ని ఆవరించింది సీత. ఈ ఆత్మస్వరూపుడే రాముడు. మాయాస్వరూపమే సీత. ఆత్మమాయల సమ్మిళిత స్వరూపమే సీతారాముల స్వరూపములు. ఈ మాయా సమేతమైన శ్రీరాముడు అయోధ్యలో ప్రవేశించాడు. అయోధ్య అనగా యోధులు చేరరానటువంటి ప్రదేశము. దీనికి హృదయము అని ఒక అంతరార్థము. దీనిని పాలించేవాడు దశరథమహారాజు. దశేంద్రియములను రథముగా గావించుకున్నవాడు దశరథుడు. కనుక దేహమే దశరథుడు. ఐదు కర్మేంద్రియములు, ఐదు జ్ఞానేంద్రియములతో కూడి దశేంద్రియములతో రథముగానున్నటువంటివాడే దశరథుడు. ఈ దశేంద్రియములకు మూడు గుణములు స్పష్టముగా

3070487O3

మనకు కన్పించుతాయి. ఇంద్రియములతో కూడిన ప్రతీ మానవునకు సత్వరజోతమోగుణములు సహజంగా ఆవరించి వుంటాయి. దేహము గుణములనే వరిస్తూవుంటుంది. కనుకనే దశరథుడు సత్వరజతమోగుణములైన కౌసల్య, సుమిత్ర, కైకను రమించాడు. కనుక కౌసల్య, సుమిత్ర, కైకేయిలు గుణముల వంటి వారు. దశరథుడు దశేంద్రియస్వరూపుడు. ఈ విధమైన గుణములుండినప్పుడు వాంఛాసక్తమైన సంకల్పములు ఆవిర్భవిస్తుంటాయి. ఆ వాంఛల ఫలితములే రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు.

ఈ నల్గురు పుత్రులు చతుర్వేదస్వరూపులు. రాముడు ఋగ్వేదము, లక్ష్మణుడు యజుర్వేదము, భరతుడు సామవేదము. శత్రుఘ్నుడు అథర్వణవేదము. ఈ ఋగ్వేదమనే రామతత్వము యజుర్వేదమునందు, సామవేదమునందు అధికంగా ఆవిర్భవిస్తూవుంటుంది. సర్వవేదములయందు యీ ఋగ్వేదము సమ్మిళితమైవుంటుంది. ఇది ధర్మస్వరూపమైనది. యజుర్వేదము మంత్రస్వరూపము. నిరంతరము రామచింతనయందే తాను కాలమును గడుపుతూ ఆ మంత్రమునే తన దృష్టియందుంచుకొని కాలమును గడిపేవాడు లక్ష్మణుడు. రామ వియోగమును భరించుకొనలేక, సహించుకొనలేక, నిరంతరమును రామనామమునే గానము చేసిన వాడు భరతుడు. అందుచేతనే భరతుడు సామవేదస్వరూపుడు. రాత్రింబవళ్లు నిద్రాహారములు మాని రామతత్వము నిరంతరము రక్షించటము తన జీవిత తత్వంగా భావించుకున్నవాడు లక్ష్మణుడు. రామ, లక్ష్మణ, భరతులను రక్షించుటకు సర్వశక్తిని వుపయోగించి, సర్వ అస్త్రశస్త్రములను ధరించి కాపాడుకున్నటువంటి వాడు శత్రుఘ్నుడు. భక్తిని, శక్తిని, ధర్మమును రక్షించు నిమిత్తమై యీ అస్త్రశస్త్రములు ధరించాడు. చతుర్వేదములైన ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదములు అయోధ్యలో దశరథుని యింట పిల్లలవలె ఆడుకుంటూ వచ్చాయి.

ఎప్పుడు యీ మాయాదేవితో కలసి అయోధ్యలో ప్రవేశించాడో అప్పుడే రాముడు జీవితమనే అరణ్యంలోకి పోయాడు. ఈ మాయతో కూడినవారికే యీ మర్మాలంతా. మాయతో కూడినదే జన్మము. కనుక మాయతో కూడినటువంటి రాముడు అరణ్యంలోకి ప్రవేశించాడు. అరణ్యములో ప్రవేశించిన తక్షణమే తన బ్రహ్మజ్ఞానమును కోల్పోతూ వచ్చాడు. ఈ బ్రహ్మజ్ఞానము సీత స్వరూపమును ధరించింది. ఈ బ్రహ్మజ్ఞాన వియోగాన్ని తాను అనుభవిస్తూ వచ్చాడు. ఈ బ్రహ్మజ్ఞానం తిరిగి తాను చేపట్టాలని అన్వేషణ జరుపుతూ వచ్చాడు. మధ్యమార్గములోపల యిరువురు సోదరులు తనకు తగిలారు. వారే వాలి సుగ్రీవులు. ఈ వాలి సుగ్రీవులు దీనత్వము వివేకము రెండింటి లోపల నిరంతరం పోరాటం జరుగుతూ వచ్చింది. దీనత్వమును సంహరించే నిమిత్తమై వివేకమునకు సహాయము చేశాడు రాముడు. అనగా సుగ్రీవునకు సహాయము చేసి వాలి అనే దీనత్వాన్ని సంహరించాడు. సుగ్రీవుడనే వివేకం సహాయము చేత ధైర్యము అనేటువంటి హనుమంతుడు స్నేహితుడయ్యాడు. ఈ ధైర్యము, వివేకము యొక్క సహాయము చేత తాను సీతాన్వేషణ సలుపుతూ వచ్చాడు. అనగా జ్ఞానమును అన్వేషణ సలుపుతూ వచ్చాడు. మధ్యలో మోహసాగరం అడ్డు వచ్చింది. అది మోహముతో కూడినటువంటిది. ఈ మోహసాగరాన్ని దాటాడు. మాయను జయించినటువంటి వాడు రాముడు మోహాన్ని సాధించలేడా. ఈ మోహసాగరం దాటిన తక్షణమే సత్వరజతమోగుణములనే మూడు గుణములు అడ్డు తగిలాయి. సత్వమనే విభీషణుడు, రజోగుణమనే రావణుడు, తమోగుణమనే కుంభ

307048704

కర్తుడు. ఈ రజో తమో గుణములను సంహరించి సత్వగుణమైన విభీషణునికి పట్టాభిషేకం చేశాడు. తిరిగి అనుభవ జ్ఞానమైన సీతను చూశాడు. బ్రహ్మజ్ఞానమైన సీత అనుభవ జ్ఞానంగా మారేటప్పటికి అయోధ్యలో ప్రవేశించాడు. ఈ విధముగా రామాయణము యొక్క తత్వము ప్రతిమానవుని యందు కూడను యీ విధమైన గుణముల చేతను, ప్రవర్తనల చేతను, సహజమైనటువంటి భావముల చేతను అయనంగా విస్తూవచ్చింది.

ఇంక లంక విషయము. దశకంఠుడు దానికి రాజు. ఈ దశకంఠుడు నిరంతరము సర్వశక్తులు వుండినప్పటికిని మోహములో మునిగినటువంటివాడు. ఇతని పేరు దశగ్రీవుడు. అయోధ్యలో దశరథుడుగా వుంటే లంకలో దశగ్రీవుడు. దశేంద్రియములు రథముగా గలవాడు దశరథుడు. దశేంద్రియములను అనుభవించేటానికి ప్రయత్నించేవాడు యీ దశకంఠుడు. ఎన్ని విద్యలుండినప్పటికి, ఎంత బుద్ధి బలము, భుజ బలము, జన బలము వుండినప్పటికి, యింద్రియ నిగ్రహము లేకున్నవాడు నీచాతినీచుడౌతాడు. ఇంద్రియ నిగ్రహం లేనటువంటివాడు ముల్లోకాలు జయించినప్పటికి తన ప్రకృతి నిమాత్రం తాను జయించలేకపోతాడు. తనను తాను సాధించలేని, జయించలేని మానవుని జన్మ నిరుపయోగమైనది. ఈ లంకలో రావణుని గుణములు అనేక విధములుగా వ్యాపించినవి. యథారాజా తథాప్రజా. రాజే యింద్రియలోలుడై అనేక విధములైన అనుభూతులను అనుభవించుచుండగా ప్రజలు కూడను అనుసరిస్తూ వచ్చారు. కనుక లంకంత యీ యింద్రియలోలత్వముతో నిండినటువంటిది. మానవత్వమంటే యేమిటో వారికి అర్థంకాదు. దివ్యత్వమంటే అసలే అర్థంకాదు. దానవత్వమే వారి స్వభావము. తినటం, త్రాగటం, యింద్రియాలను అనుభవించటం. కానీ యాంత్రికముగా అనేక విధములైన పూజలు, వ్రతములు, యజ్ఞములు, యాగములు జరుపుతూ వుండేవారు. తెల్లవారి మొదలు యీ అగ్నిజ్వాలల లోపల అన్ని వీధులయందు హోమములు జరుగుతూవుండేవి లంకలో. లంకాపట్టణాన్ని స్వర్గాన్ని మించిన అందంగా వుండేటట్లుగా తీర్చిదిద్దాడు రావణుడు. ఈ రావణుడు సీతను అపహరించాడనే విషయాన్ని గుర్తించిన హనుమంతుడు లంకలో ప్రవేశించి, ఆ లంకను ఒక్కతూరి దర్శించినప్పుడు ఛీ! రావణుడు కాదు యీ విధముగా సీతను అపహరించటం. ఎవరో అపహరించి వుండవచ్చును. ఇతను యింద్రలోకములో వుండవలసినవాడు. ఇంద్రునకు యిలాంటి గుణము వుండదు అని అతనిలో ఒక విధమైన సందేహం యేర్పడింది. ప్రతివీధిలోపల యజ్ఞం జరుగుతోంది. ప్రతి వ్యక్తి వేదమంత్రములు ఉచ్చరిస్తున్నారు. ఆగ్రామం చూస్తే అద్దమువలె మహాశుద్ధముగా వుంది. అలాంటి పట్టణమునకు వుండిన రాజు యిలాంటి దుర్మార్గములో ప్రవేశిస్తాడా? కనుక రావణుడు దుర్మార్గుడనే విషయాన్ని విశ్వసించలేదు హనుమంతుడు. ఈ విధమైన సౌందర్యముతో కూడిన యీ లంకాపట్టణాన్ని చూసాడు హనుమంతుడు.

సంతసంబున వీధివీధులు
దాంతుశాలలు వాడమేడలు
రంతు చేసెడి జంధువదనలు
కాంతకేళి హంగులెన్నియు.

ఈ విధమైన అందముతో కూడిన భవనములన్నిటినీ దర్శించాడు హనుమంతుడు. ఎక్కడ చూచినా అంద

307048705

మైన వనములు, పుష్పములు. ఇట్టి సౌందర్యముతో కూడిన లంకయందు జీవితానికి కళంకము గావించే వ్యక్తులు నివసిస్తు వచ్చారు. కట్టకడపటికి లంక అనగా మేడి పండు వంటిది అనుకున్నాడు హనుమంతుడు.

మేడిపండు చూడ మేలిమై యుండును
పొట్ట విప్పి చూడ పురుగులుండు.

ఈ లంక చూస్తే చాలా సౌందర్యముగా కన్పిస్తుంది మేడి పండు వలె. కానీ లోపల చూస్తే చాలా దుర్మార్గులైనటువంటి వ్యక్తులున్నారు. ఇలాంటి లంకాపట్టణము యొక్క చరిత్రను పవిత్రమైన దివ్యత్వముగా మార్చగలిగిన అయనమే రామాయణము.

దానవత్వాన్ని దివ్యత్వంగా తీర్చిదిద్దిన అయనమే రామాయణము. రామలక్ష్మణులు రాక్షసులతో యుద్ధం చేసే సమయంలో లక్ష్మణుని యొక్క బాణము ఒక గృహిణి చేయి పట్టుకొని నడుస్తున్న ఒక చిన్న బిడ్డపైన పడింది. బిడ్డ మరణించింది. బిడ్డను వదిలిపెట్టి తల్లి తన రక్షణ కోసం పరుగెత్తింది. అప్పుడు లక్ష్మణుడు అడిగాడు. రామా! చూచితివా రాక్షసుల గుణము. బిడ్డకై తల్లి ప్రాణాలైనా వదులుతుంది కాని బిడ్డ ప్రాణములు వదలగా తన ప్రాణము రక్షించుకొనే నిమిత్తమై యీ తల్లులు ప్రయత్నిస్తున్నారు. ఇది రాక్షస గుణం యొక్క స్వభావము. రాముడు లక్ష్మణుని శాంత పర్చాడు. లక్ష్మణా తొందరపడక విచారించు. నిజముగా ఆమె యొక్క హృదయము పవిత్రమైన హృదయము. నా దర్శనం కావటం చేత ఆమె భావములు పవిత్రముగా మారిపోయాయి. సర్వసంగపరిత్యాగిగా మారింది. ఆమెను పిలచి యెందు నిమిత్తమై తాను పరుగెత్తుతున్నది యిది స్వార్థమా పరార్థమా అని ప్రశ్నించమన్నాడు. ఒక వానరుని పంపించి ఆ రాక్షస స్త్రీని పిలిపించాడు. ఆమెను అడిగినప్పుడు ఆమె చెప్పింది. రామచంద్రా నా బిడ్డపైన ప్రేమ లేక కాదు. ప్రాప్తి లేనటువంటి వాడు పోయాడు. కానీ నేను బ్రతకగల్గాను. నేనింకా నా ప్రాణాన్ని కాపాడుకుంటూ వుంటే ఆ రామచంద్రుడు యీ రావణుని జయించి యీ లంకలో వున్న రాక్షసులందరిని అయోధ్యలో పెట్టుకున్నప్పుడు మేము కూడను శ్రీరామచంద్రుని యొక్క సేవను చేయవచ్చును కదా అని దానిని ఆశించి నేను నా ప్రాణాన్ని రక్షించుకోటానికి ప్రయత్నించాను అంది. ఏనాటికైనా యీ లంకా ప్రజలను శ్రీరామచంద్రుడనుగ్రహించి అయోధ్యలో ప్రవేశపెట్టుకుంటాడు. అప్పుడు మేము అయోధ్యలో అంతఃపురములో రామసేవ చేసుకొని ఆనందాన్ని అనుభవించాలని ఆశతో నేను యీ జీవితాన్ని కాపాడుకుంటున్నాను అంది.

కనుక మంచిలో చెడు, చెడ్డలో మంచి కూడా వుంటుంటాయి. పవిత్రంలో అపవిత్రము, అపవిత్రములో పవిత్రము కూడ వుంటుంటాయి. అందువలన భగవంతుడెక్కడ మనకు కనిపిస్తాడంటే అశాంతిలో ప్రశాంతి, ప్రశాంతిలో ప్రకాంతి, ప్రకాంతిలో పరంజ్యోతి. ఆ పరంజ్యోతియే పరమాత్మతత్త్వమన్నారు. అశాంతిలోనే వుంటుందట ప్రశాంతి. అయితే అశాంతస్య కుతః సుఖమ్ అన్నారు. అశాంతికి సుఖము లేదన్నారు. అది చాలా పొరపాటు. వివేక హృదయము లేనటువంటి వాడు అశాంతిని మాత్రమే దర్శిస్తాడు, వివేక హృదయము కలిగిన వాడు అశాంతిలో వున్న ప్రశాంతిని చూస్తూ వస్తాడు. కనుక ప్రశాంతిని ఆశించే వ్యక్తిగా మనము తయారు కావాలి. ఇది ఒక టంబ్లరు. ఈ టంబ్లరులో అర్థభాగము నీరుంటున్నది. అశాంతి పరుడు యేమి చూస్తాడు అయ్యో, అర్ధము నీళ్ళే వున్నాయే టంబ్లరులో

307048706

అనుకుంటాడు. కాని ఆశాపరుడేమనుకుంటాడు అర్ధము నీళ్లున్నాయి అదే చాలు అనుకుంటాడు. నిరాశాపరుడు అర్ధాన్ని ఖాళీగా చూస్తాడు. ఆశాపరుడు అర్ధాన్ని నీళ్లగా చూస్తాడు. ఆశాపరుడు గులాబిని చూస్తాడు నిరాశాపరుడు ముండ్లను చూస్తాడు. ఆశాపరుడు ఏరోప్లేను కనిపెడతాడు. నిరాశాపరుడు పారాచూట్‌ను కనిపెడతాడు. ప్లేనులో పోదామని ఆశాపరుడు చూస్తే, దాంట్లోనుండి పడిపోతామేమోనని నిరాశాపరుడు దానికి పారాచూట్‌ను కనిపెడతాడు. కాబట్టి జగత్తునకు ఆశాపరుడు నిరాశాపరుడు యిద్దరు కూడను వుపయోగంగానే వుంటారు. ఆశాపరుడు నిరంతరం తలపైకెత్తి నక్షత్రాలనే చూస్తుంటాడు. నిరాశాపరుడు తలవంచి మట్టిని మాత్రమే చూస్తుంటాడు. ప్రతీమానవుడు ఆశాపరుడుగా తయారు కావాలి: ఏ ఆశాపరుడు? లోకసంబంధమైన ఆశలు కాదు. ఆత్మసంబంధమైన ఆశ. లంకయందు కూడను ఇటి ఆత్మాన్వేషణాసక్తులు వంటి రాక్షసులు కూడావున్నారు. అయోధ్యలో అందరు భక్తులుగానే, అందరూ మహాత్ములుగానే కన్పించారు. కాని అట్టిపవిత్రమైన అయోధ్యానగరంలో కూడను అల్పబుద్ధులు కల్గి దైవమునందు కూడను దోషాలను వెతికేటువంటి వారున్నారు. ఈ చాకలివాడు రాముని యందు దోషాన్ని వెతికే కదా సీతను అరణ్యానికి పంపించగల్గాడు. పదినెలలు లంకలో వుండిన సీతను రాముడు సిగ్గులేకుండా తెచ్చిపెట్టుకున్నాడు. నేను అట్లా నా భార్యను నేనొప్పుకోను అన్నాడు. అసూయకు, అనసూయకు వుండినటువంటి వ్యత్యాసమును గుర్తిస్తూవచ్చాడు హనుమంతుడు. హనుమంతుడు సామాన్యుడు కాదు. మహాగుణవంతుడు. మహాబలవంతుడు. ఈ రామతత్వాన్ని చక్కగా గుర్తించినటువంటివాడు హనుమంతుడు. ఈ రామతత్వాన్ని చక్కగా గుర్తించిన రెండవ వ్యక్తి సుమిత్ర. మూడవవాడు విశ్వామిత్రుడు. ఈ ముగ్గురు మాత్రమే సీతారాముల తత్వాన్ని చక్కగా అర్థం చేసుకున్నారు. సత్వగుణమైన కౌసల్య కూడను రాముని సరిగా అర్థం చేసుకోలేదు. రాముడు అరణ్యానికి వెళ్లే సమయంలో కన్నీరు మున్నీరుగా యేడ్చింది. పాపం కౌసల్య రాముని వదలలేక అన్నపానాదులు వదలింది. కానీ సుమిత్ర ఆవిధంగా చేయలేదు. తన కుమారుడైన లక్ష్మణుని రాముని వెంటపంపింది. నాయనా! రామతత్వమందరికీ అర్ధంకాదు. రాముడు లేని అయోధ్య మాకు అరణ్యము రాముడున్నటువంటి అరణ్యమే నీకు అయోధ్య రామసేవయందెట్టి లోపమురాకుండా, అదే తల్లితండ్రుల సేవగా భావించి నీవు వెళ్లమంది. రాముడు సామాన్యమైనవాడు కాదు. సాక్షాత్తు నారాయణుడు నాయనా! అని లక్ష్మణునికి బోధించింది. అతని భాగమే నీవు.

కారణమేమనగా పుత్రకామేష్టి యాగం దశరథుడు ప్రారంభించినప్పుడు అందులో భగవదనుగ్రహస్వరూపమైన పాయసపాత్ర లభించింది. ఈ పాయసమును రెండు భాగములుగా విభజించాడు వశిష్ఠులవారు. కౌసల్య పట్టపురాణి. పరమప్రీతికి పాత్రురాలైనటువంటి దికైక. కనుకనే వీరిద్దరికి మాత్రమే దీనిని భాగాలుగా పంచాడు. కారణమేమనగా కైకకు పుట్టినటువంటి కుమారునికే నేను పట్టాభిషేకము చేస్తానని కేకయరాజుకు ప్రమాణం చేశాడు దశరథుడు. ఒకవేళ పట్టపురాణికి బిడ్డ కలిగాడంటే పట్టపురాణి బిడ్డకు తప్పనిసరిగా పట్టాభిషేకం చేయాలి. ఈ కైకకో లేక కౌసల్యకో కుమారుడు కలిగాడంటే రాజుగా కావటానికి అవకాశముంది కాని సుమిత్ర కొడుకులకు యేమాత్రం అవకాశము లేదు. ఆకాలములో యీసవతులలోపల కూడ యెంతో ప్రేమ అన్యోన్యత వుండేది. ఈ సుమిత్ర

307048707

బాధను గుర్తించి కౌసల్య తన భాగములో అర్ధభాగాన్ని, కైక తన భాగములో అర్ధభాగాన్ని కలిపి యీ సుమిత్రకు కూడా యిచ్చారు. కనుక యీ సుమిత్రకు రెండు భాగములు చేరి పోయినవి. కనుక కౌసల్య గర్భంలో వున్నటువంటి రాముని యొక్క భాగము లక్ష్మణునిగా యిక్కడ చేరి పోయాడు. కైక గర్భంలో వుండినటువంటి భరతుని యొక్క భాగము శతృఘ్నునిగా యిక్కడ చేరిపోయాడు. కనుకనే రామలక్ష్మణులు ఒకవైపున, భరతశతృఘ్నులొకవైపున చేరిపోయారు. సుమిత్రకు పుట్టినప్పటి నుండి యీ లక్ష్మణుడు, శతృఘ్నుడు నిరంతరం యేడుపులే. ఎన్ని యంత్రములో కట్టారు. ఎన్ని మంత్రములో వేశారు. ఎన్ని విధములైన మందులిచ్చారు. కాని వీరు యేడ్పు బయి మాత్రం మానలేదు. నిద్రాహారములు మానినారు. నిరంతరము రోదన చేస్తూ వచ్చారు. ఈ బాధను భరించుకొనలేక సుమిత్ర వశిష్ఠుల వారి దగ్గరకు వెళ్ళింది. వశిష్ఠుల వారు ఐదు నిముషములు ధ్యానములో కూర్చొని చూచారు. అమ్మా సుమిత్రా! నీవు బాధపడనక్కరలేదు. ఈ లక్ష్మణుని తీసుకువెళ్ళి రాముని తొట్టెలో పండబెట్టు. ఈ శతృఘ్నుని తీసుకువెళ్ళి భరతుని తొట్టెలో పరుండబెట్టు అని చెప్పారు. ఈ రాముని తొట్టెలోపల కొంచెం స్థలం తీసుకొని అతని ప్రక్కన లక్ష్మణుని పరుండపెట్టింది సుమిత్ర కౌసల్య అనుమతి తీసుకుని. ఈ భరతుని తొట్టెలోపల శతృఘ్నుని పరుండ పెట్టింది. ఎప్పుడు అక్కడ పండబెట్టారో యింక యేడ్పు లేదు నవ్వులే నవ్వులే. ఆనందంగా ఆహారం తీసినప్పటికి వారు చాలా సంతుష్టిగా, పుష్టిగా పెరుగుతూ వచ్చారు. అనగా వారి వారి స్వస్థానమునకు వారు చేరేంతవరకు యీ ఆవేదన తప్పదు. సముద్రానికి అంశము నది. తిరిగి సముద్రాన్ని చేరేంత వరకు యీ నదికి యెక్కడా శాంతి గాని, విశ్రాంతి గాని వుండదు. జలమునకు అంశము చేప. ఎన్ని భౌతికమైన సదుపాయములు చేసినప్పటికిని తన స్వస్థానమైన జలానికి పోయేటంత వరకు యీ చేపకు మాత్రం శాంతి లభించదు. తల్లికి అంశము బిడ్డ. తల్లి దగ్గరకు పోయేంత వరకు యెంతమంది యెత్తుకున్నా ఆ బిడ్డ యేడ్పు మానదు. అదే విధముగనే చెట్టుకు కొమ్మ అంశము. చెట్టునుండి కొమ్మను తెగ కొట్టేస్తే కొన్ని నిముషాలలోపల యెండిపోతుంది. అదే విధముగనే జీవుడు దేవుని అంశము. కనుక యీ జీవుడు యెంత కాలం సంతోషములతో, సౌఖ్యములతో, ఆనందములతో, భోగములతో వుండినప్పటికి అశాంతి అతనిని వెంటాడుతూనే వుంటుంది. నిజమైన శాంతి యెప్పుడు లభిస్తుందంటే తిరిగి తన స్వస్థానమైన దైవముతో కూడినప్పుడే శాంతిని అనుభవిస్తాడు. కనుక ప్రతి జీవికి భగవంతుడే స్వస్థానము. ఈ స్వస్థానమును చేరుకొనే నిమిత్తమై రాముడు అయిన స్వరూపుడై సర్వత్రా తాను సంచరిస్తూ వచ్చాడు.

ఈ అన్నదమ్ములలోపల యెంత సహనము. ఎంత త్యాగము. ఎంత ఔదార్యము. చిత్రకూట పర్వతముపై భరతుడు తన రాజ్యములో వున్న ప్రజలనందరిని తీసుకొని వెళ్ళి శ్రీరాముని పాదములపైన పడ్డాడు. త్వమేవ రాజా ధర్మజ్ఞా! అన్నాడు. నీవే ధర్మస్వరూపుడవు. నీవే యీ రాజ్యమేలుటకు అర్హుడవు. నాకు యీ అర్హత లేదు. అని యెన్నో విధములుగా ప్రార్థించినప్పుడు తిరిగి రాముడు కూడను అదే చెప్తూ వచ్చాడు. నీవే దీనికి అధికారివి. నీవే దీనిని పాలించాలి. నీకే యీ ధర్మస్వరూపము తెలుసు అన్నాడు. ఒకరినొకరు యీ విధముగా నీకంటె అర్హుడు లేడని అతను, నీకంటె అర్హుడు లేడని యితను ప్రార్థిస్తూ వుండే సమయంలో వశిష్ఠుల వారు ప్రవేశించారు. భగవంతుని మనసు

307048708

యేమాత్రంకూడను నొప్పించకూడదని భరతునికి బోధించాడు. నాయనా భగవంతుడు నొప్పిపడేటువంటి వాడు కాదు. అయినప్పటికిని మనస్థాయినుండి మనమే విధముగాకూడను భగవంతునికి కించిత్తైనా అశాంతి కల్గనివ్వకుండా చూచుకోవాలి అన్నాడు. ఈ వాదనలతో మనకేమాత్రం శాంతిలభించదు. సత్యమూర్తే లేదు. సర్వజ్ఞుడైనటువంటి భగవంతునికే సర్వము అర్పించు. అతని ఆజ్ఞను నీవు శిరసావహించు. అంతేకాని నీవు యేదో సోదరభావము చేతను, ఆవేదన చేతను, అశాంతి చేతను రాముని మనసును నొప్పించటానికి ప్రయత్నించవద్దు అన్నాడు. ఈనాడు నీవు తెలియక అతనిని నొప్పించినప్పుడు నీవు తెలియకుండా యింతకు వెయ్యింతలు బాధపడవలసి వస్తుంది అన్నాడు. అదే విధముగనే యీనాటి మానవులు నవ్వుతూ నవ్వుతూ అనేక దుష్కర్మల నాచరిస్తూ వుంటారు. కాని తిరిగి యేడుస్తూ యేడుస్తూ దాని ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది. నవ్వుతూ నవ్వుతూ చేసిన పాపం యేడుస్తూ యేడుస్తూ అనుభవించవలసి వస్తుంది. కనుక పాపములకు నీవే మాత్రం పాల్పడవద్దన్నాడు. శ్రీరాముని యొక్క హృదయం సున్నితమైనది. అతను సాక్షాత్తూ ధర్మపరుడు. సత్యస్వరూపుడు. మహాత్యాగి. తనకీ లోకములో కావలసినది యేదీ లేదు. కాని లోకసంరక్షణార్థము, ధర్మసంరక్షణార్థము, సత్యపరిపాలన నిమిత్తమై తాను యీ స్వరూపాన్ని ధరించాడు. కనుక అతని ఆజ్ఞను నీవు శిరసావహించు. యీ మాటలు మానివేయమన్నాడు. అతనికి అధికారంపైన వాంఛ లేదు. స్వార్థం అసలే లేదు. వ్యక్తిత్వానికి మితిమీరినటువంటి వాడు. అలాంటి రాముని దగ్గర నీవు యిలాంటి వాదన చేయటము నిరుపయోగము అన్నాడు. అప్పుడే రాములకు బదులు రాముని పాదుకలైనా అనుగ్రహించమని కోరాడు భరతుడు. ప్రక్కనే వుండినటువంటి లక్ష్మణుడు చాలా సూక్ష్మబుద్ధి కలవాడు. ఈ భరతుడు రామపాదములను అనగా పాదరక్షలను కోరుతూ వున్న సమయములోపల యీ అరణ్యములో సంచరించేటువంటి రాములకు పాదరక్షలు కూడా లేకుండా చేస్తున్నావా నువ్వు అని బాధపడ్డాడు. ఈ అన్నదమ్ముల లోపల యీ విధమైనటువంటి సౌమ్యత యీ విధమైన అన్యోన్యత యీ విధమైన సహనభావము యీనాడు లోకములో యెక్కడా కన్పించదు.

ఈ సీతాన్వేషణ సాగిస్తున్న సమయములో ఒకచోట కబంధుడు యెదురు తగిలాడు. పెద్ద బాహువులు కలిగినటువంటి వాడు కబంధుడు. శిరస్సు లేదు. పొట్టమాత్రమే వుంది. ఆ పొట్టపైనే కన్నులు వుంటాయి. అతి దూరములో నున్నటువంటి రామలక్ష్మణులిద్దరిని చంకలో యిరికించుకున్నాడు. అప్పుడు లక్ష్మణుడు చాలా బాధపడ్డాడు. అన్నా! నేను పోయినప్పటికి ఫరవాలేదు. మీరు తప్పించుకొని పొండి. ఈ కబంధునికి నేను ఆహారంగా వుండి శరీరత్యాగం చేసుకుంటాను. మీరు కొంచెం దూరంగా పొండి అన్నాడు. రాముడు చెప్పాడు లక్ష్మణా నీవు తప్పించుకొని పో. నేను యీ కబంధునికి ఆహారమవుతాను. ఈ విధముగా ఒకరి రక్షణకై మరొకరు అనేక విధములుగా పాటుబడ్డారు. ఇంతటి ప్రేమతో వుండేవారు రామలక్ష్మణులు.

లక్ష్మణుడు మూర్ఛిల్లిన సమయంలో రాముడు లక్ష్మణుని దగ్గరకు వచ్చి సీత వంటి భార్యను లోకంలో వెలకు వెలు సంపాదించుకోవచ్చును. కన్నతల్లి వంటి కౌసల్యను సంపాదించుకోవచ్చును. కానీ లక్ష్మణుని వంటి సోదరుడు నాకీ జగత్తులో చిక్కడని బాధపడ్డాడు. ఈ అన్నదమ్ముల లో

307048709

యింతఅభిమానముపుండేది. ఇదిజగత్తుకు ఆదర్శవంతమైనది. భరతుడుకూడను అంతే. శ్రీరామచంద్రుడు తిరిగి అయోధ్యను వచ్చేంతవరకు నేను అయోధ్యలో కాలుపెట్టనని చెప్పి నందిగ్రామములో శ్రీరామచంద్రునివలె జటాధారియై నారవస్త్రములు ధరించి తపస్సు చేసుకుంటూకూర్చున్నాడు.

కనుక యీ రామాయణములోపల తల్లి బిడ్డలసంబంధం యెలాంటిది. భార్యాభర్తల సంబంధము యెలాంటిది. అన్నతమ్ములసంబంధం యెలాంటిది. ప్రజాపాలకుల యొక్క సంబంధం యెలాంటిది అనే విషయాన్ని రామాయణము చక్కగా నిరూపిస్తూవచ్చింది. ప్రభువుకు, దాసునికి వుండవలసిన సన్నిహితసంబంధబాంధవ్యాన్ని కూడను చక్కగా నిరూపించింది. రావణుడు సీతను అపహరించి తీసుకొని పోయే సమయంలో జటాయువు సీతను రక్షించే సమయములో యెన్నోవిధముల రావణునితో పోరాడి కడకు తన ప్రాణాన్ని వదులుకుంది. నా నిమిత్తమై ప్రాణములు వదలిన యీ జటాయువునకు సద్గతి కలిగించాలని చెప్పి, తన తొడపై పెట్టుకొని, అనేకవిధములుగా ఓదార్చి తనయొక్క ప్రాణమునకు తగిన ధన్యత అనుగ్రహించాడు. రాముని నమ్మినవాడు, రామవాక్యాన్ని పరిపాలనగావించినవాడు, రామునియొక్క ప్రేమకు పాత్రులైనటువంటి వారిని తానుయేనాడు దూరం చేయలేదు.

లంకాపట్టణమునకు చేరుటకుపూర్వము విభీషణుడు వచ్చి రామా! నేను నీశరణాగతుడనని పాదములపైన పడ్డాడు. లక్ష్మణుడు చెప్పాడు అన్నా మరుత్వరపడి వీనిని శరణాగతునిగా అంగీకరించకూడదన్నాడు. ఇది రాక్షసజాతి. రావణుని సోదరుడు యేదో ఒక స్వార్థము నిమిత్తమై నీ దగ్గరకొచ్చి చేరుతున్నాడు. ఈ గుడ్లగూబలు చీకటినే ఆశిస్తాయిగాని వెలుతురును యేనాడు కాంక్షించవు. ఈ రాక్షసులు స్వార్థమునందు మాత్రమే మునుగుతారుకాని పరార్థమును యేనాటికిని వారు చూడరు. కాబట్టి యేదో ఒక సంకుచితమైన భావముచేతనే నీ పాదములపై పడుతున్నాడు. నీవు తక్షణమే అతని అభయమివ్వవద్దన్నాడు. అప్పుడు రాముడు చెప్పాడు. నాయనా! యెవరైతేనాకేమి. నాపాదములపైపడి స్వామి! నేను శరణాగతుడను అని అన్నప్పుడు వారు యెవరైనా సరే నేను రక్షిస్తానన్నాడు. నీవాడని ఒకపరి యనవా వాడైననేమి ఏలదువానిన్. స్వామి నేను నీవాడను అని ఒక్కతూరి పాదములపైపడిన వాడు యెవరైనాసరే వాడు నావాడే. నేను వాడివాడినే. అతనికి నేను తప్పక అభయమిస్తానన్నాడు. నేను నీ వాడను అని ఒక్కతూరి ఒక్క మాటఅంటే నాకు అపకారం చేసేవాడైనా సరే నేను అభయమిస్తానన్నాడు.

రాములకు ఏకవాక్యము, ఏకపత్ని, ఏకాస్త్రము. కనుక నేరామాయణము యొక్కతత్త్వము లోపల యీరామజననము సంవత్సరమునకొకసారి చేసుకుంటూవుంటారు. సూర్యుడు మేషరాశియైనప్పుడు, చంద్రుడు కర్కాటకరాశియైనప్పుడు పునర్వసు నక్షత్రములోవుండాడు అదే శుభలగ్నము. రామజననము. అదే చైత్రశుద్ధ నవమి. సంవత్సరమునకొకసారి రామజననం చేసుకోవచ్చు. కానీ మూర్ఖులైనవారు అజ్ఞానులైన మానవులు సంవత్సరమునకొక పర్యాయము రామకళ్యాణము చేసుకుంటారు. రామునకు కళ్యాణము ఒక్కపరే ప్రతిసంవత్సరమునకొకసారి పెండ్లి చేయకూడదు. ఏకపత్నీవ్రతుడని చెప్పుకుంటూ సంవత్సరమునకొకతూరి పెండ్లి. ఇంక తిరుపతికి పోతే దినము పెండ్లిండ్లే. ఇవంతా బుద్ధిలకున్నై చేసేటువంటి పనులు. రాముని విశిష్టతకు మనము దోషాలు కల్గిస్తున్నాము. పట్టాభిషేకం కూడ ఒకతూరి

అవుతుంది కానీ దినము పట్టాభిషేకము అవుతుందా? జననం కూడను సంవత్సరమునకొకపరి జననం వుండదు. కానీ అది ఒక చిహ్నంగా తీసుకుంటారు. ఇదియే birth. అనగా నా ఆత్మసామ్రాజ్యము లోపల ఆత్మారాముని యొక్క birthday అనే భావన మనం అనుసరించాలి.

దశరథ కుమారుని రాముడు కాదు. నా ఆత్మారాముడు. రాముడు నిరంతరం నన్ను రంజింపచేస్తున్నాడు. రమయతి ఇతి రామః. మనసును రమింపచేసేటువంటిదే రామతత్త్వము. కనుక దశరథమైన దేహమునందు ఆవిర్భవించినదే రామతత్త్వము. అదే ఆత్మతత్త్వము. ఇలాంటి ఆత్మారాముని విశ్వసించి ఆనందమత్తో ప్రయత్నము సల్పి దీనిని అంత్యముగావించుకోవాలి. అహంకారముతో దీనిని యేమాత్రం అంత్యంగావించరాదు. కనుక అహంకారం పెరిగినటువంటి వానికి గాఢ్ఢి అన్నారు. సోహం తత్త్వాన్ని గుర్తించుకున్న వానికి హరి అన్నారు. మనం అహం అనేటువంటి భావము నుండి సోహం అనేటువంటి భావములో మనము ప్రవేశించాలి. ప్రతి మానవుడు కోహం కోహం అంటూ పుడుతున్నాడు. కోహం నేనెవరు నేనెవరు అంటున్నాడు. ఈ విధముగా పుట్టిన మానవుడు తిరిగి చచ్చేటప్పుడు నేనెవరు అని చస్తే ఇంతకాలం తిని, జీవించి, చదివి ఇంత పెద్దైపోయి యేమి ప్రయోజనము. కాలేజీలో చేరి యెన్ని సంవత్సరములైనా ఒకే క్లాసులో వుంటుంటే వాడు యెంత మొద్దు రాచిప్ప. ఇలాంటి మూర్ఖుడు కాలేజీకి పోయి చదవటమెందుకు. అదే విధముగనే కోహం అనేవాడు యీ ప్రపంచములో ప్రవేశించి యెన్నో సంవత్సరములు జీవించి కడకు కోహం కోహం అని చస్తే వాని జీవితము వ్యర్థమే కదా. కనుక కోహం తో జన్మించి సోహం తో అంత్యము కావాలి. కోహం ప్రశ్న నేనెవరు. సోహం. ఇది జవాబులు. నేను ఆత్మతత్త్వమని జవాబు చెప్పి కన్నుమూయ్యాలి. ఇది మానవుని ప్రధానమైన జన్మరహస్యము. ఒకటి ప్రారంభమూ. రెండవది అంత్యము.

రామ అయనము ప్రారంభము నుండి ఆనందముతోనే, సత్యధర్మాల లోపలనే దీనిని అంత్యంగావించాడు. ఎన్ని కష్టములు, ఎన్ని నష్టములు, ఎన్ని నిందలు, ఎన్ని నిష్ఠూరములు ఎన్ని బాధలు కల్గినప్పటికి తన సత్యపాలన యేనాడూ వదలలేదు. అగ్నిప్రవేశంలో రాముని మాత్రమే సీత చూస్తోందట. సీతకు రాముడు మాత్రమే కనిపిస్తున్నారు. కాని రామునకు లోకం కూడా కనిపిస్తోందట. ఇక్కడ యేమి కారణమూ. కేవలం నేను ముద్దు సీతనే చూస్తే లోకరక్షణ ప్రధానమైనది కదా. లోకము యేమనుకుంటుందో అనే ఉద్దేశ్యముతో లోకముపైన దృష్టి పెట్టి సీత కంటె లోకమే నాకు ప్రధానమనుకున్నాడు. పదినెలలు లంకలో వున్నటువంటి సీతను పరీక్ష చేయకుండా తెచ్చుకుంటే అపనిందల పాలౌతాము. ఎంత ఆదర్శానికి విరుద్ధంగా వుంటాము అనే దృష్టితో తాను పరీక్ష చేసి, అగ్నిదేవుడు దగ్గర కూడను యీమె సాక్షాత్ పవిత్రత అనే వాక్యాన్ని తీసుకొని వెళ్ళాడు. అప్పుడే అగ్నిహోత్రుడు కూడను రామో విగ్రహవాన్ ధర్మః అన్నాడు. నీవు సాక్షాత్తు ధర్మస్వరూపుడవు రామా అన్నాడు. ఎందుకంటె నీ ధర్మమే లోకమనుభవిస్తుంది. అక్కడ కూడను రాముడు my life is my Message అని నిరూపించాడు. రామతత్త్వమనేది ప్రతి మానవునకు ఒక message. అలాంటి రామతత్త్వాన్ని హృదయపీఠంపైన ప్రతిష్ఠించుకొని మానవత్వమును దైవత్వంగా మార్చుకోటానికి తగిన ప్రయత్నం చేయటమే రామజననానికి సరియైన కృతజ్ఞత.